# మనకెందుకు గుర్తుంది మృగశిర కార్తె?

క్షణాలు, నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు.. ఇవన్నీ కాలాన్ని కొలిచేందుకు ఏర్పరుచుకున్న ప్రమాణాలు. అలాంటివే కార్తెలు కూడా! అయితే వారాలు, నెలలు, సంవత్సరాలు గుర్తున్నట్టు కార్తెలకు మనకు గుర్తుండవు. మనం దీనికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం ఒక కారణం. మాములువారికి కూడా రెండు మూడు కార్తెలు గుర్తుంటాయి. అటువంటివే రోహిణి కార్తె, మృగశిర కార్తె. మిగిలిన కార్తెలు మర్చిపోయినా ఈ రెండు కార్తెలే గుర్తుండడానికి కారణం ఏమిటి?



రోహిణి కార్తె సమయంలో సాధారణంగా ఆంధ్రరాష్ట్రంలో ఎండలు మండిపోతుంటాయి. వేసవి తీవ్రతకు రోహిణి కార్తె అలా ప్రామాణికంగా నిలిచిపోయింది. అదేవిధంగా మృగశిర కార్తె! మృగశిర కార్తె ప్రవేశ సమయానికి రాష్ట్రమంతటా చిరుజల్లులు పడుతుంటాయి. వాతావరణం చల్లబడుతుంది. ఇలాంటి కారణాల వల్లే మరో రెండు మూడు కార్తెలు అందరికి గుర్తుండినా, మృగశిర కార్తె ప్రారంభ రోజు ఆంధ్రప్రదేశ్‌లో అందరికీ గుర్తుండడానికి కారణం. చేపమందు. ఆస్మా రోగులకు బత్తిన సోదరులు మృగశిర కార్తె ప్రారంభం రోజున చేపమందు ఉచితంగా పంచుతుంటారు. అందువల్ల మృగశిర కార్తె కొద్దిగా పరిచయమయ్యింది.

అసలింతకీ కార్తె అంటే ఏమిటి?

కాలాన్ని లెక్కిస్తున్నప్పుడు ఆ లెక్కకు ఆధారంగా అనేక అంశాలను తీసుకున్నారు.

సూర్యుడు ఉదయించిన సమయం  నుంచి మరో సారి ఉదయించిన సమయం వరకూ ఒకరోజు అని ఒకరు లెక్కించారు. ఇలాగే అనేక లెక్కలు పుట్టుకొచ్చాయి. అలాంటి లెక్కల్లోదే ఈ కార్తె కూడా!

ఒక నక్షత్రం సూర్యుడితో కలిసి ఉదయించిన కాలాన్ని కార్తెగా లెక్కించారు. మృగశిర నక్షత్రంతో కలిసి సూర్యుడు సంచరించే కాలం మృగశిర కార్తె అయ్యింది.

ఆ సమయానికి ఋతువులలోమార్పు వల్ల రాష్ట్రంలో వర్షాలు పడడం మొదలవుతుంది  కాబట్టి మనకు ఎక్కువగా గుర్తుండిపోతోంది.